సాక్షి
తిరుపతి
బుధవారం। 22। నవంబర్। 2023



నేలకూలిన చింత చెట్టు

వర్షాల కారణంగా నాయుడుపేట వద్ద భారీ చింత చెట్టు నేలకూలింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. - 8లో



శ్రీనవగ్రహ హోమం

తిరుపతిలోని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో శ్రీనవగ్రహ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



బాగు'బడి'

నాడు-నేడు పథకం కింద జిల్లాలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. సకల వసతులు సమకూరాయి. - 8లో

న్యూస్‌రీల్

డిసెంబర్ చివరి వారంలో డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ చివరి వారంలో నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరుకానున్న మొదటి, మూడో సెమిస్టర్ విద్యార్థులు ఈ నెల 25లోపు, ఐదో సెమిస్టర్ విద్యార్థులు 30వ తేదీలోపు వర్సిటీ నిర్ణయించిన పరీక్ష ఫీజును చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు మంగళవారం నోటిఫికేషన్‌ను పంపించినట్టు తెలిపారు. సోమవారం ఎస్వీయూ అధికారులతో పాలకమండలి సభ్యులు సమావేశమై పరీక్షల నిర్వహణ విధివిధానాలపై చర్చించారు. దీంతో మూడు సెమిస్టర్లకు ఒకే దశ పరీక్షలు నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు నిర్ణయించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,198 మంది స్వామివారిని దర్శించుకోగా 22,452 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.19 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వర్షాలపై అప్రమత్తం



రావులవారిపాళెం గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

చిల్లకూరు: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తీర ప్రాంతంలోని బకింగ్ హామ్ కెనాల్‌కు ఆవలి వైపున ఉన్న గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం రావులవారిపాళెం, పోసినవారిపాళెం గ్రామాల్లో పర్యటించారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బంకింగ్ హామ్ కెనాల్‌కు సముంద్రం నీరు ఎక్కువగా చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు. పర్యటించిన వారిలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ అంజిరెడ్డి, ఆర్ఐ రమ్యస్వాతి, వీఆర్‌ఓలు బాలాజీ, జగదీష్ ఉన్నారు.

చౌకదుకాణాల్లో రాగులు తీసుకోండి



రాజారఘువీర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

తిరుపతి అర్బన్: జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు డిసెంబర్ 1వ తేదీ నుంచి మూడు కిలోల రాగులను బియ్యానికి బదులుగా తీసుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి రాజరఘువీర్ మంగళవారం తెలిపారు. రేషన్ కార్డులో ఒక వ్యక్తి మూడు కిలోల రాగులు తీసుకుంటే మిగిలిన రెండు కిలోలు బియ్యం తీసుకోవచ్చని చెప్పారు. కనీసం ఒక కిలో రాగులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మిగిలిన 4 కిలోల బియ్యాన్ని ఉచితంగా పొందవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై రేషన్ డీలర్లతో వివాదాలకు దిగకుండా గుర్తించాలని ఆయన సూచించారు.



వారు పెద్దపెద్ద చదువులు చదవలేదు. శాస్త్రసాంకేతిక రంగాల్లో రాణించలేదు. అత్యాధునిక యంత్రాలపై శిక్షణ తీసుకోలేదు. పురాతన కాలం నాటి మగ్గాలనే నమ్ముకున్నారు. దేవుడిచ్చిన నైపుణ్యాన్ని రంగరించి అద్భుతమైన కాటన్ పట్టు చీరలను తయారు చేస్తున్నారు. మగువలకు మరింత అందం తెస్తూ అబ్బుర పరుస్తున్నారు. భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబాలను ఒంటిచేత్తో నెట్టుకొస్తున్నారు.. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట మహిళలు. వీరు నేసే కాటన్ పట్టుచీరలకు దేశవిదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉందంటే అతిశయోక్తి కాదు. కాటన్ పట్టుచీరలు ఎలా తయారు చేస్తారు.. ఎలా కష్టపడతారో మీరే చదవండి!



అల్లు పడుతున్న మహిళ

చీరకు సింగారం.. నైపుణ్యం బంగారం

- కాటన్ పట్టు చీరలకు పుట్టినిల్లు 'బంగారుపేట'
- ఇక్కడ తయారుచేసే కాటన్ చీరలకు భలే డిమాండ్
- చీరలు నేసే వారంతా మహిళలే
- 2వేల కుటుంబాలకు జీవనోపాధి

సైదాపురం: వెంకటగిరి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో బంగారుపేట గ్రామం ఉంది. ఈ గ్రామంలో 680 చేనేత కుటుంబాలున్నాయి. వారంతా మగ్గాల ద్వారానే చీరలను నేస్తున్నారు. కాటన్ చీరల తయారీలో ప్రత్యక్షంగా 1000 మందికి, పరోక్షంగా మరో 2 వేల మందికి ఉపాధి దొరుకుతోంది. ఇక్కడ పనిచేసే కూలీలంతా మహిళలే. అఆలు కూడా రాని ఆ మహిళలు నైపుణ్యం గల కాటన్ చీరలు తయారు చేస్తున్నారు. ఆధునిక ప్రపంచంలో అత్యానిధునిక పరికరాలు వస్తున్న ఈ రోజుల్లో కూడా మగ్గాలనే ఉపయోగిస్తూ అద్భుతమైన కాటన్‌చీరలు తయారు చేస్తూ మగువుల మనసు దోచుకుంటున్నారు.



చీరను మడతపెడుతున్న చేనేత కార్మికులు

ఎలా తయారు చేస్తారంటే?

కాటన్ చీరకు అవసరమైన ముడిసరుకును వివిధ రకాల పరిమాణంలో వేరుచేస్తారు. చేనేత యాజమానుల నుంచి నూలు తెచ్చుకుంటారు. చీరలు తయారు చేసే ముందు సాగళ్లు తెచ్చుకుని అచ్చు ఎత్తుకుని అల్లు పట్టుకుంటారు. అనంతరం దోనేకు చుట్టుకుని మగ్గంపై చీరను తయారుచేసేందుకు సిద్ధంచేస్తారు. రాట్నం ద్వారా కండెలను ఒడికి బంకలో నానబెట్టి అల్లికచేస్తారు. తర్వాత వివిధ రకాల డిజైన్లలో కాటన్ పట్టు చీరలను తయారు చేస్తారు. వారమంతా ఇంటిల్లిపాదీ కష్టపడితే 5 కాటన్ పట్టు చీరలను నేస్తారు.

లేటెస్ట్‌కు నాలుగైదు రోజులు

లేటెస్ట్ డిజైన్ తయారు చేయాలంటే నాలుగైదు రోజులు పడుతుంది. దీనికి రూ.4 వేలు ఇస్తారు. మామూలు సాధారణ డిజైన్ చీరను ఒక్క రోజులో నేస్తారు. తెల్లవారుజాము నుంచి చేనేత పనుల్లో మహిళలు నిమగ్నమవుతుంటారు. ఆధునిక యంత్రాలు రావడంతో కాటన్‌పట్టు చీరలు తయారు చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా ఈ ప్రాంతంలో తయారు చేసే కాటన్ పట్టు చీరలకు మంచి డిమాండ్ ఉండడంతో స్థానికులు దీనిపైనే ఆధారపడ్డారు. ఈ ప్రాంతంలో తయారుచేసే కాటన్‌పట్టు చీరలకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

అంతా మహిళలే

ఇక్కడ పనిచేసేవారంతా మహిళలే. చేనేత మహిళా కార్మికులు తమ ఇళ్లల్లోనే మగ్గాలను ఏర్పాటు చేసుకుని ఇంటిల్లిపాదీ కాటన్ పట్టు చీరలు నేస్తుంటారు. నాణ్యత గల చీరలను తయారుచేసే వారంతా మహిళలే ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో ఉన్న మహిళలు మాత్రమే ఈ కాటన్ చీరలను నేయగలరు. అందుకే ఈ ప్రాంతంలో ఉన్న మహిళలకు మాత్రమే ఇక్కడ ఉపాధి కల్పిస్తుంటారు.







వివిధ రకాల డిజైన్లు

మగువలు మెచ్చే డిజైన్లు

జామ్ దాని వర్క్, కల్పవృక్షం, కామధేనువు, కర్పూర, బృందావనంలో శ్రీకృష్ణుడు వంటి డిజైన్లతో కాటన్ బై కాటన్‌లో చీరలు తయారు చేస్తున్నారు. ఆయా డిజైన్లలో తయారు చేసిన చీరలకు జాతీయ స్థాయిలో అవార్డులు సైతం దక్కాయి. పట్టుకు పట్టు విభాగంలో కంచి స్టైల్స్ లైట్ వెయిట్‌తో ఆల్ ఓవర్ డిజైనింగ్ చీరలు తయారు చేస్తున్నారు.

డిజైన్‌ను బట్టి రేటు

చీరలకు కావాల్సిన ముడిసరుకును షావుకారి(ఏజెన్సీ) వద్ద తెచ్చుకుంటున్నారు. ఒక షావునకు అంటే నాలుగు చీరలకు సరిపడా ముడిసరుకుకు రూ.20 వేల వరకు అవుతుంది. అయా సరుకును కొందరు ఏజెన్సీలు తెచ్చి ఇస్తుంటారు. మరికొందరు సొంతంగా కొనుగోలు చేసి చీరలు నేసి ఏజెన్సీలకు విక్రయిస్తున్నారు. ఇలా భార్యాభర్త డిజైన్‌ను బట్టి వారం పది రోజులు మగ్గం నేస్తే నాలుగు చీరలు పూర్తవుతాయి. దీనికి ఒక్కో చీరకు ఖర్చు పోను రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. ఏజెన్సీల ద్వారా అమెరికా, తమిళనాడు, తెలంగాణతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇటీవల సినిమా పరిశ్రమకు చెందిన వాళ్లు ఎక్కువగా నేత చీరలను కొనుగోలు చేస్తున్నట్టు నేత కార్మికులు చెబుతున్నారు.

అదే మాకు పదివేలు



చేనేత పరిశ్రమలో చీరలను నేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. వారం రోజులపాటు ఇళ్లల్లో ఉన్న మగ్గాలపై చీరలు చేస్తూ వాటిపై వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చీరలను వివిధ డిజైన్లలో తయారుచేసేటప్పుడు పలువురు శభాష్ అంటూ మెచ్చుకుంటారు. మాకు అదే పదివేలు.
–పేరునేటి లక్ష్మి,
నేత కార్మికురాలు, బంగారుపేట

దేవుడు ఇచ్చిన కళ ఇది



చదువురాకపోయినా ఆ దేవుడు మాకు ఇచ్చిన కళ ఇది అనుకుంటుంటాం. తరతరాలుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం. భర్తకు చేదోడువాదోడు నిలుస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.
–దోపర్తి పార్వతి,
నేత కార్మికురాలు, బంగారుపేట

నేతన్న నేస్తం ఆదుకుంటోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేనేత కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయి. పనులు ఉన్నా లేకపోయినా సరే ప్రతిఏటా నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.25 వేలు నేరుగా మా బ్యాంక్ ఖాతాల్లోనే డబ్బులు జమచేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.
– సీత ప్రవతమ్మ,
నేత కార్మికురాలు, బంగారుపేట

పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాం



నేతన్న నేస్తం పథకం ద్వారా చాలా లబ్ధిపొందుతున్నాం. పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నాం. కష్టపడి పనిచేసుకుంటూ ఆనందంగా జీవనం కొనసాగిస్తున్నాం. జగనన్న పుణ్యమా అని మరింత సంతోషంగా బతుకుతున్నాం.
– పీ.రాజేశ్వరి,
నేత కార్మికురాలు, బంగారుపేట



రాట్నం ద్వారా కండెలు చుట్టుతున్న మహిళ



మగ్గం ద్వారా చీరను నేస్తున్న దృశ్యం

కడలి కల్లోలం



వాకాడు: కడలి కల్లోలంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి క్రమంగా పెరుగుతోంది. మంగళవారం వాకాడు మండలం, తూపిలిపాళెం వద్ద సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. అలాగే సముద్ర తీరంలో ఎడతెరిపి లేని వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తున్నాయి. స్థానికులు చలికి వణికిపోతున్నారు. గత రెండు రోజులుగా సముద్రంపై చేపల వేటలో ఉన్న మత్స్యకారులు ఒడ్డుకు చేరుకుంటున్నారు. బోట్లు, వేట సామగ్రిని ఒడ్డున భద్రపరిచారు. మత్స్యకార పెద్దలు కొందరు సముద్రం వద్దే నిఘా పెట్టారు. తీరప్రాంత గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు.

23న దివ్యానుగ్రహ హోమం



మాట్లాడుతున్న టీటీడీ జేఈవో సదాభార్గవి

తిరుపతి(అలిపిరి): అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో నవంబర్ 23న శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమాన్ని ప్రారంభించనున్నట్లు జేఈవో సదాభార్గవి తెలిపారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం నుంచి సప్త గోప్రదక్షిణ మందిరం వరకు మంగళవారం ఉదయం వివిధ కళాకారులతో జేఈవో ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హోమం విశిష్టతను దేశం నలుమూలల తెలియజేయాలని ఈ యాత్ర ను నిర్వహించినట్లు తెలిపారు. ఎస్వీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి పాల్గొన్నారు.

ఆహ్లాదం..హరి నివాసం



తిరుమలేశుడి ఆవాసం ఆహ్లాదకరంగా మారింది. మంచు దుప్పటి కప్పుకుని ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మంగళవారం ఉదయం శ్రీవారి ఆలయంపై హరివిల్లు హొయలొలుకుతూ కనువిందు చేసింది. ఆ సుందర దృశ్యాన్ని భక్తులు తమ సెల్ ఫోన్లలో బంధించడం కనిపించింది. - తిరుమల

అనుభవించు రాజా!

- చిత్తూరులో టీడీపీ నేతల భూ దందా
- విలువైన కాలువపోరంబోకు భూమి ఆక్రమణ
- అడ్డురాకుండా ఉండేందుకు మొక్కలు నాటిన వైనం
- అనుభవం పేరుతో ఎకరం రూ.లక్ష చొప్పున విక్రయం
- బదిలీపై వెళ్లిన వీఆర్‌ఓ కన్నసన్నల్లో అక్రమదందా
- ఉన్నతాధికారుల కళ్లుగప్పి తమ్ముళ్ల భూదందాలు



కాలువ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటి ఉన్న దృశ్యం

సాక్షి, తిరుపతి: చిత్తూరులో టీడీపీ నేతలు ప్రభుత్వ భూములపై కన్నేశారు. కొందరు అధికారుల అండతో విలువైన భూములను నొక్కేస్తున్నారు. ఆక్రమించుకున్న భూముల్లో మొక్కలు నాటి అనుభవం పేరుతో ఒకరు దర్జాగా జెండా పాతేస్తున్నాడు. ఆపై భూములు తన అనుభవంలో ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి విలువైన భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. మరొకరు తన అనుభవంలో ఉన్న భూమి రహదారి కోసం తీసుకున్నారంటూ ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని నొక్కేస్తున్నాడు. ఈ అక్రమ భూదందా బదిలీపై వెళ్లిన ఓ వీఆర్‌ఓ కన్నుసన్నల్లో నడుస్తోంది. చిత్తూరు మండలం, 36 గొల్లపల్లి ప్రాంతంలో రెండేళ్ల క్రితం చిత్తూరు- తచ్చూరు రోడ్డు పురుడు పోసుకుంది. ఈ రోడ్డుకు ఇరువైపులా పట్టా భూములతో పాటు వందల ఎకరాల మేత బీడు భూమి, కాలువ భూమి, బీడు భూములు ఉన్నాయి. ఇటీవల జరిగిన రీసర్వేలో కూడా ఈ భూములు ప్రభుత్వానికి సంబంధించినవిగా గుర్తించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ఈ భూములు కోట్ల రూపాయల ధర పలుకుతున్నాయి. భవిష్యత్‌లో మరింతగా డిమాండ్ పెరుగుతుందని భావించిన టీడీపీ నేతలు ఓ వీఆర్వో సహకారంతో ఇద్దరు రెవెన్యూ అధికారులతో కలిసి ఈ భూములపై కన్నేశారు.

టీడీపీ నేతా.. మజాకా?

గొల్లపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు తన తెలివితేటలు ఉపయోగించి ప్రభుత్వ భూములను తన అనుభవంలో ఉన్నట్లు పత్రాలు సృష్టించుకున్నాడు. చిత్తూరు- తచ్చూరు రోడ్డు వేయడంతో తన భూమి పోయిందని పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు ఎకరానికి రూ.1.5 లక్షల చొప్పున వీఆర్వో, మరో ఇద్దరు రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇచ్చుకున్నాడు. బదిలీపై వెళ్లిన ఓ వీఆర్‌ఓ సహకారంతో అంతా స్కెచ్ వేశాడు. రూ.లక్ష చేతిలో పెట్టి రూ.15 లక్షల పరిహారాన్ని కొట్టేసేందుకు మార్గం సుగమం చేసుకున్నాడు. డీల్ ప్రకారం మూడెకరాలకు పరిహారం అందినట్లు సమాచారం. అయితే పరిహారం పంపకాల్లో అధికారులు, టీడీపీ నేత మధ్య వివాదం రేగినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆక్రమించి.. ఆపై అనుభవం

మరో టీడీపీ నేత విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి మామిడి మొక్కలు నాటేశాడు. ఆ మొక్కలు చూపించి ఆ భూమి తన అనుభవంలో ఉన్నట్టు ఆ వీఆర్వో సహకారంతో రికార్డులు తయారు చేయించుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమదేనంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. అనుభవ పత్రాలు చూపించి వెంటనే అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. ఆక్రమించుకున్న కాలువ పోరంబోకు భూమి మూడెకరాలు ఇప్పటికే ఇతరులకు విక్రయించారు. మిగిలిన భూమికి అనుభవ పత్రాలు సృష్టించే పనిలో నిమగ్నమైనట్లు విశ్వసనీయ సమాచారం.

పక్క సర్వే నంబర్ వేసి అమ్మేస్తున్నారు

ఆ వీఆర్వో మరి కొన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని విక్రయించి సొమ్ముచేసుకునేందుకు మరో పథకం వేశాడు. గుట్టుచప్పుడు కాకుండా పక్కనున్న పట్టా భూమి సర్వే నంబర్‌ను వేసి ప్రభుత్వ భూములను ఇతరులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను బాగా అర్థం చేసుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. మంగళవారం మండలంలోని ఓబులశెట్టివారిపల్లి ఉన్నత పాఠశాల, మద్దినాయనపల్లి, కొత్త ఒడ్డిపల్లి, వల్లివేడు, ఎంపీపీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు తప్పకుండా తరగతులకు హాజరవ్వాలని, క్రమం తప్పకుండా ఇచ్చిన వర్క్‌ను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు రాసిన నోట్‌బుక్కులను పరిశీలించి తప్పుఒప్పులను సరి చేయాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి నోట్స్‌ను పిల్లలకు అందించాలన్నారు. పాఠశాలలో ఉండే స్మార్ట్ టీవీ, ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డ్స్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకటరమణ, సుబ్బరామయ్య, వనజకుమారి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు శ్రీనివాసులు, శివకుమారి పాల్గొన్నారు.

నేలకొరిగిన చింతచెట్టు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మడపలం గ్రామ సమీపంలో రహదారి పక్కనే ఉన్న 100 ఏళ్ల నాటి చింత చెట్టు మంగళవారం నేలకొరిగింది. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షంతో రహదారి పక్కనే ఉన్న చింత చెట్టు మంగళవారం తెల్లవారు జామున ఒక్కసారిగా నేలకొరిగింది. విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం కూడా నేలవాలింది. ఆ సమయంలో రహదారిపై రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

బాకరాపేట: భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భాకరాపేటకు చెందిన మోహిత్(21) భాకరాపేట నుండి ఎర్రావారిపాళెంకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా దీన్‌దార్లపల్లె వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు. అలాగే భాకరాపేట బస్టాండులో రోడ్డు దాటుతున్న బాలుడిని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తల్లిదండ్రులు వారు వచ్చిన కారులోనే తిరుపతికి తీసుకెళ్లడంతో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాగుబడి

ప్రజాసంకల్ప యాత్రలో గుర్తించిన అంశాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాడు విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన మాటను గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించారు. విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. మరోవైపు సీబీఎస్ఈ సిలబస్‌ను, ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టి తల్లిదండ్రుల మనసు దోచుకున్నారు. సరికొత్త మెనూ అమలు చేస్తూ విద్యార్థులనూ ఆకట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు సిఫార్సులు చేసే స్థాయికి చేరుకున్నాయి. దీంతో పిల్లలు ఎంచెక్కా చదువులమ్మ ఒడితో పాఠాలు నేర్చుకుంటున్నారు.

– తిరుపతి అర్బన్



శ్రీకాళహస్తి నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

జనవాక్కు

అధునాతన వసతులు



గతంలో మాపాఠశాల చాలా అధ్వానంగా ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాడు–నేడు పథకం పేరుతో పాఠశాల రూపు రేఖలు మారాయి. ఇరుక గదుల సమస్య తీరింది. పాఠశాలకు అత్యాధునిక వసతులు సమకూరాయి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నాం. దీనిపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు సంతోషంగా పాఠశాలలకు వస్తున్నారు. విద్యార్థులకు ఇంగ్లిషు పాఠాలను కూడా బోధిస్తున్నాం.

– జెడ్.విజయలక్ష్మికుమారి, హెచ్ఎం, సైదాపురం

అడ్మిషన్లకు సిఫార్సులు



తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్లో అడ్మిషన్లకు సిఫార్సులు వస్తున్నాయి. 2019లో నేను ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా వచ్చాను. అప్పుడు 272 మంది విద్యార్థులే ఉన్నారు. నాడు–నేడుతో పాఠశాల రూపురేఖలు మారాయి. మొదటి విడతలో రూ.80 లక్షలతో కార్పొరేట్ తరహాలో ఆధునీకరణ పనులు చేపట్టారు. ప్రహరీ గోడ, రన్నింగ్ వాటర్‌తో కూడిన అధునాతన బాత్‌రూమ్‌లు, ప్రతి తరగతి గదిలో నాలుగు ట్యూబ్‌లైట్లు, నాలుగు ఫ్యాన్లు, బల్లలు వంటి సౌకర్యాలు కల్పించారు. రెండో విడతలో అదనంగా 5 తరగతి గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డిజిటల్ విద్యలో భాగంగా పాఠశాలకు 8 ఐఎఫ్‌పీ ప్యానెల్స్, 3స్మార్ట్ టీవీలు, ఇంటర్నెట్, ఇవే కాకుండా 8, 9 తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించారు. పాఠశాలలో 2022–23 విద్యాసంవత్సరానికి 590 మంది విద్యార్థులు చేరారు. అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు సిఫార్సు లేఖలు తీసుకువస్తున్నారు.

–ఆర్.వంశీరాజ, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహైస్కూల్, ముత్యాలరెడ్డిపల్లి, తిరుపతి

మా బడి బాగుంది



మా ఊర్లో ప్రభుత్వ పాఠశాల గతంలో అధ్వానంగా ఉండేది. పిల్లలు బలవంతంగా బడికి వెళ్లేవారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మా పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నాడు–నేడు కింద పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించారు. అలాగే పాఠశాల గదులను అధునాతనంగా తీర్చిదిద్దారు. నూతనంగా మరుగుదొడ్లు నిర్మించారు. పిల్లలను ఆకర్షించేలా తరగతి గదులను రూపొందించారు. నా ఇద్దరు కుమార్తెలను స్థానికంగా ఉన్న బడికే పంపుతున్నాను. విద్యాకానుక కింద యూనిఫాం, పుస్తకాలు, బూట్లు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇచ్చారు. అమ్మఒడి ద్వారా ఏటా రూ.15వేలు అందుతోంది. పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించారు. టీచర్లు కూడా బడికి సమయానికే వస్తున్నారు. ప్రైవేటుస్కూళ్లకంటే గవర్నమెంటు బడులు చాలా బాగున్నాయి.

– ఈటిపాకుల ఎల్లమ్మ, వీకేఆర్‌వై గిరిజన కాలనీ, వరదయ్యపాలెం మండలం

మా బడి ప్రైవేట్ కంటే మిన్నగా..



మాది చిట్టత్తూరు గ్రామం, రామచంద్రాపురం మండలం. ఎంతో కాలంగా ఎదుగూబొదుగు లేక మా ఊరి పాఠశాల అధ్వానంగా ఉండేది. దీనికితోడు పాఠశాలలో తెలుగు మీడియం చదువులు మాత్రమే చెప్పేవారు. విధిలేక మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించా. జగనన్న ప్రభుత్వం వచ్చాకా నాడు–నేడుతో తరగతి గదులు, మరుగుదొడ్లు, బల్లలు, ఫ్యాన్లు, గోడ చిత్రాలతో మా ఊరి బడి సర్వాంగ సుందరంగా తయారైంది. దీనికి తోడు ఇంగ్లిషు మీడియంలోనే చదువులు చెబుతున్నారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో మాన్పించి ప్రభుత్వ బడిలో చేర్పించా.

–గీతాంజలి, విద్యార్థి తల్లి, చిట్టత్తూరు ప్రాథమిక పాఠశాల, తొట్టంబేడు

కొత్తగా ఉంది



గతంలో పాఠశాల శిథిలావస్థలో ఉండేది. సీఎం జగన్ పాఠశాలలకు కొత్త రూపు రేఖలు తీసుకువచ్చారు. నేడు పాఠశాల కొత్తగా ఉంది. నాడు–నేడు కింద పాఠశాలలో బిడ్డలకు ఇంగ్లిష్ చెప్పడంతోపాటు పెద్ద టీవీ ఏర్పాటు చేసి దాని ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. ఇలాగే అయ్యోర్లు శ్రద్ధతో చదువు చెబితే పిల్లలను కాన్వెంటులకు పంపాల్సిన అవసరం లేదు. బడిలో యూనిఫాం, పుస్తకాలు, బూట్లు, ఇవ్వడంతో పాటుగా అమ్మ ఒడి ద్వారా నగదు ఇస్తుండడం సంతోషంగా ఉంది. నా కుమార్తె సహస్రను ఒకటవ తరగతిలో కాన్వెంటుకు పంపా. ఇప్పుడు గ్రామంలోనే ఇంగ్లిషు చెబుతుండడంతో ఇక్కడే చేర్పించా.

– కొండాపురం ముత్యాలమ్మ, కలవకొండ గ్రామం, చిల్లకూరు మండలం

గడువు పొడిగించాలి

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలోనూ, ఐఐఐటీలలో 3500 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అయితే అధ్యాపకుల నియామకానికి విధించిన గడువు సోమవారంతో ముగిసినందున దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. దీంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులు సంబంధిత అధికారుల నుంచి నిరభ్యంతర పత్రాన్ని పొందడంలో జాప్యం జరిగిందన్నారు. దీపావళి సెలవుల వలన కావాల్సిన సర్టిఫికెట్స్‌ను పొందడం ఆలస్యం కావడంతో చాలా మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేక పోయారు వాపోయారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దరఖాస్తు గడువు తేదీని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించాల్సిందిగా విద్యాశాఖ మంత్రికి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గడువు పెంపునకు సహకరించాలని కోరారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేణిగుంట: మండలంలోని గాజుమండ్యం ఆయిల్ ఫ్యాక్టరీ కూడలిలో మంగళవారం అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని సూరప్పకశంకు చెందిన చెంచురెడ్డి(47) ఆయిల్ ఫ్యాక్టరీ కూడలి వద్ద అధిక ధరకు మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లతో సహా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

40 గొర్రెల అపహరణ

ఓజిలి: మండలంలోని వాకాటివారికండ్రిగ గ్రామంలో ఎల్లు సుబ్రమణ్యంకు చెందిన 40 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించుకుని వెళ్లారు. స్థానికులు వివరాల మేరకు.. సుబ్రమణ్యం గొర్రెలను ఆవరణలోని పాకలో తొలి రాత్రి 11 గంటల వరకు కాపలా కాశాడు. ఆపై వర్షం రావడంతో పాకలో నుంచి ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఉదయం నిద్రలేచి పరిశీలించగా 40 గొర్రెలు, పొట్టేలు పిల్లలు కనపించలేదు. చుట్టు పక్కల గాలించినా కనబడకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన గొర్రెల విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

24న జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఆర్, రిలయన్స్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫైనాన్స్ తదితర ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరవుతారని తెలిపారు. సుమారు 350 ఉద్యోగాలకు ఈ జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కార్తీక తెప్పోత్సవాలు



ముస్తాబవుతున్న తెప్ప

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి 5 రోజుల కార్తీక తెప్పోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పద్మ సరస్సును రంగు రంగుల విద్యుత్ దీపాలతో, దేవతా మూర్తుల ప్రతిమలతో సుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్యా మాట్లాడుతూ కార్తీక పౌర్ణమికి అయిదు రోజులు ముందు నుంచి తెప్పోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. రోజూ ఆలయంలో ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక తిరుమంజనం ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. తొలి రోజు సీతా సమేత శ్రీరాములు, గురువారం శ్రీకృష్ణుడు, చివరి మూడు రోజులు శ్రీదేవీ, భూదేవీ సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తెప్పపై విహరిస్తారని అన్నారు. మొదటి రెండు రోజులు కోనేరులో మూడు చుట్లతో, శుక్ర, శనివారాలు ఐదు, చివరి రోజు ఆదివారం కార్తీక పౌర్ణమి రోజున ఏడు చుట్లతో తెప్పపై స్వామివారి విహారం ఉంటుందని వివరించారు.

నిబంధనల మేరకే పరీక్ష ఫీజు

చిత్తూరు కలెక్టరేట్ : నిబంధనల మేరకే ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజులు వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే రూ.2లక్షల జరిమానా తప్పదని, కళాశాలను సైతం సీజ్ చేస్తామని ఉమ్మడి జిల్లా ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం చిత్తూరులోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీఈఆర్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. 2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ ఏడాది పరీక్షకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రీ అడ్మిషన్ అయ్యే విద్యార్థులకుఅమ్మఒడి, రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా ఏ,బీ, సీ గ్రేడ్‌ల సర్టిఫికెట్ అందిస్తున్నట్లు వెల్లడించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫెయిల్ అయిన వారు 16,793 మంది ఉన్నట్లు వివరించారు. వీరి పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా చెల్లించేలా ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలన్నారు. ఫీజులు చెల్లించకపోతే ఆయా కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఈఓ సయ్యద్‌మౌలా, పీసీఆర్ కళాశాల ప్రిన్సిపల్ మజీద్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

సోమల: మండల కేంద్రం సమీపంలో కాలిన మృతదేహాన్ని మంగళవారం ఉదయం గ్రామస్తులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి సీఐ రాఘవరెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలు సోమలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోటేశ్వరయ్య భార్య విజయలక్ష్మి(53)గా గుర్తించారు. ఆమె కొద్దిరోజులగా అనారోగ్యంతో బాధ పడుతోందని, ఈ కారణంగానే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి తెలిపారు.

త్వరితగతిన ఓటరు క్లెయిమ్స్ పరిష్కారం



ఆర్డీవో కార్యాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

నగరి : ఓటర్ల జాబితాకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్స్ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం నగరి, నింద్ర, ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు తహసీల్దార్ కార్యాలయాలను ఆయనన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారం 6,7,8 క్లెయిమ్స్‌ను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలన్నారు. ఈనెల 23వ తేదీ లోపు పెండెన్సీని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

పెద్దపంజాణి/గంగవరం : ఓటరు క్లెయిమ్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం పెద్దపంజాణి, గంగవరం, శాంతిపురం, కుప్పం మండలాల తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ నిబంధన మేరకు ఓటరు క్లెయిమ్స్‌ను పక్కాగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఆర్టీసీ అభివృద్ధి



అలిపిరి డిపోలో పూజా కార్యక్రమం

తిరుపతి అర్బన్: సమష్టి కృషితో తిరుపతి జిల్లా ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు తిరుపతి అలిపిరి డిపోలో ఆర్టీసీ సర్వీసులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీపీటీవో మాట్లాడుతూ వరుసగా రెండేళ్లపాటు రాష్ట్రంలో తిరుపతి జిల్లా రాబడిలో ప్రథమస్థానంలో నిలవడానికి ఐక్యతతోనే ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది రెండుసార్లు తిరుమల బ్రహ్మోత్సవాలు చేపట్టినప్పటికి విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. రోవైపు 100 విద్యుత్ బస్సులను అలిపిరి డిపో కేంద్రంగా విజయవంతంగా నడుపుతున్నాయని చెప్పారు. కార్గో వ్యాపారాన్ని పెద్ద ఎత్తున విస్తరించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, టీఎం రామచంద్రనాయుడు, అలిపిరి అసిస్టెంట్ డీఎం పుష్పలత, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఈఆర్ కుమార్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వీ.మస్తాన్, జోనల్ సహాయ కార్యదర్శి బీ.మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు డీ.గురునాథ, జిల్లా కార్యదర్శి టీ.సత్యనారాయణ, సీసీఎస్ డెలిగేట్ వీసీఎస్ శెట్టి, డిపో కార్యదర్శి టీ.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో సీసీఎస్ భవనం



మాట్లాడుతున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ని నిర్మిస్తున్నామని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డీ.హరిత పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ఏఈకామ్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాంట్రాక్టు ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ఎండీ హరిత మాట్లాడు తూ పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సముదాయంలో సీసీఎస్ బిల్డింగును నిర్మిస్తున్నామన్నారు. సీసీఎస్ వ్యవస్థ ద్వారా తిరుపతి నగరంలో శానిటేషన్, భద్రత, ట్రాఫిక్ వంటి వాటిని నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. నెలవారీ పనుల పురోగతిని తన ముందు ఉంచాలని ఆదేశించారు. ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎయికామ్ బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీనవగ్రహ హోమం



కపిలేశ్వరాలయంలో శ్రీనవగ్రహ హోమం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం శ్రీనవగ్రహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో నెల రోజుల పాటు హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం నవగ్రహహోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, నవగ్రహ కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకామాక్షి అమ్మవారి కలశస్థాపన, విశేష దీపారాధన చేపట్టారు. హోమ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 22వ తేదీ బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు శ్రీకామాక్షి అమ్మవారి హోమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.